క్లుప్తంగా

మంత్రి పొన్నంను కలిసిన పట్టణాధ్యక్షుడు



ముస్తాబాద్‌: రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లో శనివారం కలిసి పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చినట్లు కాంగ్రెస్‌ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు తెలిపారు. ముస్తాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మంత్రికి వివరించామన్నారు. మండల అభివృద్ధికి తీసుకోవాల్సిన పనులపై చర్చించామన్నారు.

స్థల వివాదంపై విచారణ

చందుర్తి: తమ పట్టా భూమిలో ప్రార్థనలు చేస్తున్నారని మండలంలోని బండపల్లికి చెందిన ఓ యువకుడు శనివారం డయల్‌ 100కు ఫిర్యాదు చేశాడు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేశ్‌ విచారణ చేపట్టారు. చందుర్తి, కోనరావుపేట మండలాల సరిహద్దు ప్రాంతంలోని బండపల్లి, బావుసాయిపేట మధ్య ముస్లింలు మసీదు నిర్మాణం కోసం 1987లో బండపల్లికి చెందిన గడ్డం రాఘవరెడ్డి వద్ద అదే గ్రామానికి చెందిన నన్నుసాబ్‌, రంజాన్‌ అలీ 0.08 గుంటల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. అప్పటి నుంచి ఈ స్థలం మసీదు కోసమే వినియోగించుకుంటున్నామన్నారు. విక్రయదారుడి మృతితో ఈ స్థలం పట్టా గడ్డం అంతవ్వ పేరిట అయిందని, పలుసార్లు అంతవ్వను అడగగా తమ కొడుకులు గల్ఫ్‌ నుంచి రాగానే పట్టా చేస్తామని తెలిపినట్లు చెప్పారు. దీంతో పోలీసులు డయల్‌ 100కు కాల్‌ చేసిన కరుణాకర్‌ను పట్టాదారు పాసు పుస్తకంతో చందుర్తి ఠాణాకు వచ్చి సమస్య పరిష్కరించుకోవాలని ఎస్సై రమేశ్‌ ఆదేశించారు. బక్రీద్‌ రోజు వివాదం తలెత్తడంతో పోలీసులు బండపల్లికి చేరుకుని విచారణ చేపట్టారు. బావుసాయిపేటకు చెందిన ఓ వ్యక్తి మృతిచెందగా ఇక్కడే ఖననం చేస్తారన్న సమాచారంతో ఈ స్థల సమస్య పరిష్కారం అయ్యేవరకు ఎలాంటి పనులు చేపట్టకుండా శనివారం పోలీస్‌ పికెట్‌ ఏర్పాటు చేశారు.

బీసీ సంక్షేమ గురుకులాల్లో అన్ని వసతులు

సాక్షి స్పందన

తంగళ్లపల్లి: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలుపుతూ 'గురుకులాల్లో వసతులేవి?' అనే శీర్షికన శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన బీసీ సంక్షేమ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్‌ జిల్లాలో ఆరు బీసీ గురుకులాలు ఉండగా వాటిలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని ఎలాంటి సమస్యలు లేవని తెలిపారు. జిల్లాలో 39 గురుకులాలు ఉండగా కేవలం 6 గురుకులాలకు సంబంధించి అధికారులు స్పందించారు.

బీజేపీని బలోపేతం చేయాలి

ముస్తాబాద్‌: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్‌ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌ మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఏర్పాటై 11 ఏళ్లు అయిందని, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి, అసెంబ్లీ కన్వీనర్‌ కరెడ్ల మల్లారెడ్డి, మెరుగు అంజాగౌడ్‌, శ్రీనివాస్‌రావు, మెంగని మహేందర్‌, జనార్దన్‌,నరేశ్‌, కోల కృష్ణ, గోపి, బాల్‌రెడ్డి, మహేశ్‌, ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌, బుర్ర శ్రీను, రవి, విజయ్‌, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



కోనరావుపేట: మరిమడ్ల మున్నూరుకాపు సంఘం నూతన అధ్యక్షుడిగా మంద రెడ్డి (గంగాధర్‌) ఎన్నికయ్యారు. శనివారం సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఆకుల దేవయ్య, కోశాధికారిగా పుల్కం నారాయణ ఎన్నికయ్యారు. సలహాదారులుగా మాజీ సర్పంచులు సింగం నారాయణ, లక్కం భాస్కర్‌ను నియమించారు.

సన్మానం

వేములవాడరూరల్‌: వేములవాడ రూరల్‌ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన అంజయ్యను రూరల్‌ కాంగ్రెస్‌ నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల బీసీసెల్‌ అధ్యక్షుడు వంగపల్లి మల్లేశం, మాజీ సర్పంచ్‌ సోయినేని కరుణాకర్‌, బండ శ్రీనివాస్‌ యాదవ్‌, బొద్దు రాములు, ఎల్లాగౌడ్‌, జిల్లా ఎస్సీసెల్‌ సెక్రెటరీ అనిల్‌, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ మానుపాటి పరశురాం,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వీర్నపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వీర్నపల్లికి చెందిన నర్సయ్య పని నిమిత్తం ఆటోలో వెళ్తుండగా మండలకేంద్రంలోని సబ్‌ స్టేషన్‌ మూలమలుపు వద్ద ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. నర్సయ్యకు గాయాలుకాగా స్థానికులు 108లో మండలంలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నోరూరించే ఆవకాయ

- వేసవిలో ఇంటింటా సందడి
- పచ్చడి పెట్టే పనుల్లో మహిళలు
- మారిన అభిరుచులతో తగ్గిన ఆదరణ
- పెరిగిన ధరలతో తయారీ భారమే



గంభీరావుపేట మార్కెట్‌లో మామిడి ముక్కలు కొడుతున్న వ్యక్తి



గంభీరావుపేట: వేడి వేడి అన్నంలో ఆవకాయ ఒక్కటుంటే చాలు.. ఆహా ఏమి రుచి అంటూ కడుపునిండా తినొచ్చు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా ప్రతి ఇంట్లో పచ్చళ్లకు ప్రాధాన్యం ఎక్కువే. వేసవి వచ్చిందంటే చాలు.. ఇంటింటా పచ్చళ్ల సందడి అపై ఎక్కువగా ఆవకాయ సందడే ఎక్కువగా కనిపిస్తుంది. ప్రతి రోజు మార్కెట్‌ పచ్చడి మామిడి కాయలతో కళకళలాడుతోంది. ప్రతి సీజన్‌లో ఇంటింటా ఎంతో కొంతమేర పచ్చళ్లు తయారు చేసుకుంటారు. ఏ పచ్చడి పెట్టినా.. పెట్టకపోయినా.. ఆవకాయ మాత్రం తప్పనిసరిగా తయారు చేసుకుంటారు.

తగ్గిన ఆదరణ

వేసవి వచ్చిందంటే చాలు.. వంటగదిలో హడావిడి మొదలయ్యేది.. ఆవకాయ పెట్టే కార్యక్రమం మొదలయ్యేది. మంచి మామిడికాయలు తెచ్చుకోవాలి.. కరెక్ట్‌ సైజులో ముక్కలు కొట్టించాలి.. సరైన మోతాదులో మసాలాలను కలపాలి.. శుచి శుభ్రత ఉంచుకోవాలి. ఎందుకంటే ఏడాదంతా నిల్వ ఉండాలి కాబట్టి. ఆవకాయ పెట్టే విధానం గురించి కొత్తవారికి అంతగా తెలియడం లేదు. మారిన అభిరుచులతో ఆవకాయపై ఆదరణ తగ్గుతోంది. ఇప్పుడు ఆవకాయ పెట్టే ఓపిక, తీరిక ఉండడం లేదు. ఈ తతంగమంతా ఎందుకని కొందరూ రెడిమేడ్‌ పచ్చళ్లు కొనేస్తున్నారు. మార్కెట్లో రకరకాల పచ్చళ్లు దొరకడం ఒక కారణమైతే.. పచ్చడికి కావాల్సిన సరుకుల ధరలు పెరగడం మరో కారణంగా చెబుతున్నారు.

ధరల దరువు..

ప్రతి ఇంటా ఖచ్చితంగా ఆవకాయ పచ్చడి తయారు చేసుకుంటారు. కానీ సరుకుల ధరలు ఆకాశన్నంటడంతో రానురాను ఆవకాయ పెట్టేవారు తగ్గిపోతున్నారు. 40 మామిడికాయలతో పచ్చడి పెట్టాలంటే దాదారు రూ.4వేల వరకు ఖర్చవుతోందంటున్నారు. ప్రస్తుతం మామిడికాయల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. ఒక్కో మామిడికాయ రూ.20 నుంచి రూ.40కు కొనుగోలు చేయాల్సి వస్తోంది. నిత్యావసర ధరలు సైతం విపరీతంగా పెరిగిపోయాయి.

ప్రతి వేసవిలో తయారు చేసుకుంటాం



ప్రతి వేసవిలో ఆవకాయ పచ్చడి తయారు చేసుకుంటాం. అవకాయ అంటే అందరూ అమితంగా ఇష్టపడుతారు. అత్యవసర సమయంలో ఆవకాయ పచ్చడి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ధరలు అధికంగానే ఉన్నాయి.

– మేడ రమణ, గృహిణి, కొత్తపల్లి

స్వయంగా తయారు చేస్తాం



మా ఇంట్లో మేమే ఆవకాయ పచ్చడి తయారు చేసుకుంటాం. మార్కెట్లో దొరికే అవకాయ కంటే ఇంట్లో తయారు చేసుకునే ఆవకాయ పచ్చడి రుచి ఎక్కువగా ఉంటుంది. పక్కాగా తయారు చేసుకుంటే ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో పాటు మంచి రుచికూడా ఉంటుంది.

– యశోద, గృహిణి, జగదాంబతండా



గంభీరావుపేట: బక్రీద్‌ వేడుకల్లో పాల్గొన్న అజ్మతుల్లా హుస్సేన్‌




ఎల్లారెడ్డిపేటలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చందుర్తి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో బక్రీద్‌

జిల్లావ్యాప్తంగా బక్రీద్‌ వేడుకలను శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాకేంద్రం, పట్టణాలు, మండలకేంద్రాలు, గ్రామాల్లో మసీదులు, ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్‌



వేములవాడలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బోయినపల్లి: తడగొండ మసీదు వద్ద ముస్లింలు



ముస్తాబాద్‌ : బందనకల్‌లో ముస్లింల ప్రార్థనలు



తంగళ్లపల్లి మదీనా మజీద్‌లో..

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం



వేములవాడఅర్బన్‌: వేములవాడ మండలం అగ్రహారం ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా ముదిరాజ్‌ సేవా సమితి ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను సత్కరించి మెమొంటోలు అందించారు. ముదిరాజ్‌ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము మాట్లాడుతూ.. ముదిరాజ్‌ విద్యార్థులకు ఏ ఆపద వచ్చినా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్‌ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటస్వామి, కర్దల భద్రాచలం, పర్ష హన్మండ్లు, చొప్పరి రామచంద్రం, నరేశ్‌, దేవరాజు, నరేశ్‌, శ్రీనివాస్‌, నర్సయ్య, మల్లయ్య, లక్ష్మణ్‌, బాబు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● పోస్టర్‌ ఆవిష్కరణ

బోయినపల్లి: మండలంలోని దేశాయిపల్లిలో ఈనెల 14,15,16, తేదీల్లో జరిగే సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సీపీఎం పార్టీ కన్వీనర్‌ గురిజాల శ్రీధర్‌, నాయకులు రామంచా అశోక్‌, కుడుకల గిరిబాబు తదితరులున్నారు.

● వ్యక్తి అదృశ్యం

వేములవాడరూరల్‌: వేములవాడ రూరల్‌ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన అబ్బగోని రాజేశం ఈనెల 2 నుంచి కనిపించడం లేదు. ఆయన కొడుకు గణేశ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. ఇటీవల కొన్ని వ్యాపారాల్లో నష్టాలు రావడంతో మనోవేదనతోనే వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

● రెండు బైక్‌లు ఢీ.. నలుగురికి గాయాలు

బోయినపల్లి: వెంకట్రావుపల్లి హైస్కూల్‌ పరిసరాల్లో రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. వేములవాడ నుంచి కరీంనగర్‌ వైపు బైక్‌పై ముగ్గురు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలుకాగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

● కొత్త పంచాయతీల్లో అభివృద్ధి పనులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో కొత్తగా ఏర్పడిన బాకూర్‌పల్లితండా, సేవాలాల్‌తండా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. సోమవారం అధికారులు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కొత్త పంచాయతీలకు ఉపాధిహామీ పథకం కింద రూ.20 లక్షల చొప్పున భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నూతన పంచాయతీలకు కార్యదర్శులు, ప్రత్యేకాధికారులను కేటాయించనున్నట్లు తెలిపారు.

● ఎస్సైని కలిసిన కాంగ్రెస్‌ నాయకులు

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సిరిసిల్ల అశోక్‌ను శనివారం కాంగ్రెస్‌ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు కే భాస్కర్‌ రెడ్డి, నాయకులు పసుల వెంకటి, గుడిసె ఐలయ్య, మామిడి సంజీవ్‌, రాజు, ఏలేటి మాధవ రెడ్డి, బెజ్జంకి శీను, బడుగు లింగం, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



తంగళ్లపల్లి: చిన్నలింగాపూర్‌లో శనివారం ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌ జే టోని మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలుచేస్తుందన్నారు. ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ నేరెళ్ల నర్సింగంగౌడ్‌, నాయకులు సత్తు శ్రీనివాస్‌ రెడ్డి, బైరినేని రాము, మునిగెల రాజు, గడ్డం మధుకర్‌, ఎగుర్ల ప్రశాంత్‌, గుగ్గిళ్ల ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని కోరెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్‌ మండల నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు గడ్డం తిరుపతిరెడ్డి, డబ్బు వెంకటరెడ్డి, శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చందుర్తి: మల్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో 2007–08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మండలంలోని మూడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగింది. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు గొర్రె దేవేందర్‌, జనపాల వెంకటయ్య, కనపర్తి శ్రీనివాస్‌, తుల శ్రీనివాస్‌రావు, తిప్పని కవిత, జనగామ తిరుపతి, శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.





ముస్తాబాద్‌: మండలంలోని కొండాపూర్‌లో ఆర్‌అండ్‌బీకి చెందిన సూచిక బోర్డును మూలన పడేశారు. కొండాపూర్‌ గాంధీ చౌరస్తా వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు ఎల్లారెడ్డిపేట, నారాయణపూర్‌, గూడెం గ్రామాలకు వెళ్లే దారులను సూచిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాతే బోర్డు తీసేసి ఓ మూలన పడేశారు. కొండాపూర్‌ చౌరస్తా వద్దకు కొత్తగా వచ్చిన వారు ఏ దారి ఎటు పోతుందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులైన స్పందించి తిరిగి బోర్డును ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : రాజేశ్వర్‌ రావు, పంచాయతీ కార్యదర్శి, కొండాపూర్‌, సెల్‌ : 9700025953

వాట్సాప్‌ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్‌ నంబర్లు: 9440243048, 9705346626

సర్కారు బడుల్లోనే చేర్పించండి



ఎల్లారెడ్డిపేట : రాజన్నపేటలో ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు



ఇల్లంతకుంట : బోటిమీది పల్లెలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట: తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌, ఎల్లారెడ్డిపేట, హరిదాస్‌నగర్‌, వెంకటాపూర్‌, రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట గ్రామాల్లో శనివారం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, నాయకులు బడిబాట ర్యాలీలు నిర్వహించారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్తాబాద్‌: బందనకల్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు.

ఇల్లంతకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులున్నాయని ఇల్లంతకుంట హైస్కూల్‌ ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత అన్నారు. జంగారెడ్డిపల్లి, వెంకట్రావుపల్లి, వంతడుపుల, ముస్కానిపేట, ఓబులాపూర్‌, సోమారంపేట తిప్పాపూర్‌, వెంకటాపూర్‌, గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

బోయినపల్లి: వెంకట్రావుపల్లిలో బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు నూతన అడ్మిషన్లలో భాగంగా బడిబాట చేపట్టినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, ఉపాధ్యాయులున్నారు.

కోడెల అక్రమ రవాణాపై విచారణ చేపట్టండి



సీఐ వీరప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

వేములవాడ: వధశాలకు కోడెలను అక్రమంగా తరలించిన వ్యవహారంలో చట్టప్రకారంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టౌన్‌ సీఐ వీరప్రసాద్‌కు హిందూ సంఘాల నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. సుభాష్‌నగర్‌లో శుక్రవారం రాత్రి వధశాలకు ఆరు కోడెలు తీసుకురాగా.. రెండింటిని మాత్రమే కాపాడామని, మిగిలిన నాలుగు ఎక్కడి నుంచి వచ్చాయి ఎలా రవాణా జరిగిందన్నారు. వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. రేగుల సంతోష్‌బాబు, గడప కిషోర్‌రావు, నాగుల రాముగౌడ్‌, రేగుల రాజ్‌కుమార్‌, లక్ష్మణ్‌, మైలారం శ్రీనివాస్‌ తదితరులు ఫిర్యాదు చేశారు.

మాజీ ఆర్మీ అధికారి హఠాన్మరణం



దేవయ్య (ఫైల్‌)

సిరిసిల్ల: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మాజీ ఆర్మీ అధికారి పాటి దేవయ్య(71) శనివారం మృతిచెందాడు. ఆయనకు కూతురు కృష్ణవేణి, కొడుకులు పాటి రాజ్‌కుమార్‌ (సిరిసిల్ల పట్టణ ట్రాక్టర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు), రవితేజ(రేషన్‌ డీలర్‌) ఉన్నారు. సిరిసిల్లలో అందరికీ సుపరిచితులైన దేవయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన హఠాన్మరణంతో పలువురు సంతాపం తెలిపారు. సిరిసిల్లలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

వైద్య పరీక్షలు

రుద్రంగి: ముందస్తు వైద్య పరీక్షలతో క్యాన్సర్‌, పక్షవాతం, గుండె జబ్బు వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని ఎంఎల్‌హెచ్‌పీ అర్చన పేర్కొన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాంలో భాగంగా శనివారం మండలకేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్‌ఎం విజయ, ఆశా సుజాత, ప్రజలు ఉన్నారు.

జంతు వధ.. బీజేపీ ఆందోళన

- ఎల్లారెడ్డిపేటలో ఉద్రిక్తత
- ఘటనపై డీఎస్పీ విచారణ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం శివారులో జంతువును వధించడంపై బీజేపీ నాయకులు శనివారం ఆందోళనకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, మారవేణి రంజిత్‌కుమార్‌, కిరణ్‌నాయక్‌, పొన్నాల తిరుపతిరెడ్డి తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రం శివారులోని చెట్లపొదల్లో జంతువును కోయడం వివాదాస్పదంగా మారింది. ఈ సంఘటనపై సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు. నిపుణులైన పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో జంతు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో శవపంచానామ చేశామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాంగీర్‌ అనే వ్యక్తి లైసెన్స్‌ లేకుండా ఎద్దులను కోస్తున్నట్లు తెలిసిందని, అతనిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్‌, ఎస్సై రమాకాంత్‌ ఉన్నారు.

విద్యుత్‌ పనులు అడ్డగింత

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌ ఖబ్రస్తాన్‌ స్థలంలో జరుగుతున్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ పనులను శనివారం ముస్లిం కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. బక్రీద్‌ రోజు ఈ ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. ముస్లింలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఖబ్రస్తాన్‌లో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాట్లు చేశారు. సెస్‌ అధికారులు పనులు చేస్తుండగా, విషయం తెలుసుకున్న ముస్లింలు అక్కడికి వెళ్లి ప్రశ్నించారు. దీంతో సెస్‌ సిబ్బందికి, ముస్లింలకు మధ్య వాగ్వాదం జరగగా పనులను అడ్డుకున్నారు. వెంటనే సంఘటన స్థలానికి ఎస్సై రమాకాంత్‌, సెస్‌ ఏఈఈ పృథ్వీధర్‌గౌడ్‌ చేరుకుని వారిని శాంతింపజేశారు. ఖబ్రస్తాన్‌ వరకు వేసిన విద్యుత్‌ స్తంభాలను తొలగించాలని డిమాండ్‌ చేశారు. సెస్‌ డైరెక్టర్‌ కృష్ణహరి ఆదేశాలమేరకు తాత్కాలికంగా పనులు నిలిపివేసి రైతులు, ముస్లింలతో చర్చలు జరిపిన అనంతరం పనులు చేపడతామని ఏఈఈ తెలిపారు.